క్లుప్తంగా

వృద్ధాశ్రమంలో అన్నదానం

కడప సెవెన్‌రోడ్స్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లాశాఖ ఆధ్వర్యంలో గురువారం కడప నగరంలోని చౌడమ్మ వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతినెల ఒకరోజు వృద్ధాశ్రమంలో లేదా అనాథ ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆ సంఘం జిల్లా కోశాధికారి నూనె నగేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మాసాపేటలో..

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని మాసాపేట సర్కిల్‌లో వినాయక చవితి 9వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. విఘ్నేశ్వరుడి విగ్రహం వద్ద 4వ రోజు పూజా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు సుభాన్‌బాషా పాల్గొన్నారు. అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు స్వర్ణ లక్ష్మినారాయణ, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

25న ధర్నా

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : మధ్యాహ్న భోజన పథకం కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 25న విజయవాడలో నిర్వహించ తలపెట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా పేర్కొన్నారు. గురువారం నగరంలోని మున్సిపల్ హైస్కూల్ (మెయిన్)లో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత ప్రతిజ్ఞ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. వై. సావిత్రి, వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం కడప జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం కడప నగరంలోని హోచిమెన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఇటీవల జరిగిన కడప జిల్లా 16వ మహాసభలలో జిల్లా నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ కమిటీలో జిల్లా అధ్యక్షులుగా వద్దమాను వీరశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా సి.సుబ్రహ్మణ్యం, జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీగా పగడ పూల మల్లికార్జున, జిల్లా ఉపాధ్యక్షులుగా ఎస్ సుబ్రహ్మణ్యం, బాష, మనోహర్ రెడ్డి, సహాయ కార్యదర్శులుగా షావలి, బ్రహ్మంలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలో అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.లక్ష్మీదేవి, బి. లక్ష్మీదేవి తెలిపారు. గురువారం కడప సీఐటీయూ జిల్లా కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కూరగాయల బిల్లులు, గ్యాస్ బిల్లులు, గత ఆరు నెలల నుండి పెండింగ్ ఉన్న సెంటర్ అద్దె బిల్లులు తక్షణమే చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో కడప అర్బన్ ప్రాజెక్ట్ నాయకురాలు శాంతి, ఎర్రగుంట్ల మండల నాయకురాలు పి. ఉమాదేవి పాల్గొన్నారు.

ఉచిత నేత్ర శిబిరం



కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న అతిథులు

కడప కల్చరల్ : స్థానిక మరియాపురంలోని మల్టీపర్పస్ సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన లభించింది. కడప మేత్రాసన కోశాధికారి రెవరెండ్ ఫాదర్ పెండ్లికట్ల దేవదాస్, 40 డివిజన్ కార్పొరేటర్ బాలస్వామి రెడ్డి, పుష్పగిరి నేత్ర వైద్య బృందం అమర్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సాగింది. రిమ్స్ వద్దగల పుష్పగిరి మల్టీ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి నేతృత్వంలో జరిగిన ఈ శిబిరాన్ని ఫాదర్ పెండ్లికట్ల దేవదాస్, ఇతర అతిథులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీఎస్ఎస్ఎస్ సంస్థ పేదలకు సేవ చేస్తోందని, అందులో భాగంగానే ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారని, 200 మందికి పైగా కంటి వైద్య పరీక్షలను చేయించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఎస్ఎస్ఎస్ సిబ్బంది, సచివాలయ, వలంటరీలు సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులోకి ఈ- స్టాంపింగ్ సేవలు

సిద్దవటం : సిద్దవటంలోని డీసీసీ బ్యాంకులో నూతనంగా ఈ-స్టాంపింగ్ సేవలు అందుబాటులోకి వచ్చినట్లు బ్యాంకు మేనేజర్ సుచిత్ర తెలిపారు. స్థానిక డీసీసీ బ్యాంకులో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ-స్టాంపింగ్ విధానం ద్వారా జ్యుడీషియల్ రూ. 10, రూ. 100 బాండ్స్ ఎలాంటి కమీషన్ లేకుండా సరఫరా చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా నిమజ్జనం



ట్రాక్టర్‌లో వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



కడప నగరం అక్కాయపల్లెలో..



లడ్డూను దక్కించుకున్న తిరుపతి యశ్వంత్ రాయల్



రామాంజనేయపురం వరద కాలనీలో గణపతి లడ్డూను దక్కించుకున్న నాగేంద్రప్రసాద్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : నగర శివార్లలోని 45వ డివిజన్ పరిధిలోని ఊటుకూరు గ్రామంలో గురువారం గణేశుని నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. ముందుగా మండపంలోని వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించి మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానికుల ఆధ్వర్యంలో వినాయకుడిని మంగళ వాయిద్యాల మధ్య ఘనంగా ఊరేగిస్తూ కేసీ కెనాల్‌లో నిమజ్జనం చేశారు.

వినాయకుని లడ్డూ వేలం

కడప కల్చరల్ : కడప నగరం వివేకానందనగర్ రోడ్డు నెంబరు 17లో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వినాయక చవితి ఉత్సవ కమిటీ 6వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గత నాలుగురోజులుగా జరిగిన ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని స్వామి వారి లడ్డూ వేలం పాట నిర్వహించారు. ఈ వేలంలో తిరుపతి యశ్వంత్ రాయల్ రూ.1.62 లక్షలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, శ్రీధర్‌రెడ్డి, మహేష్, ప్రదీప్‌కుమార్, కార్పొరేటర్ రామలక్ష్మణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మట్టిదిబ్బ తొలగించండి



బైపాస్‌రోడ్డులో ఉన్న మట్టి కుప్ప

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని తిరుపతి బైపాస్‌రోడ్డులో రిమ్స్ పోలీస్‌స్టేషన్ సమీపంలో కల్వర్టు వద్ద కేబుల్ వైర్ల కోసం గుంత తీసి ఆ మట్టినంతా రోడ్డుపై వేశారు. అనునిత్యం వాహనాల రాకపోకలతో అత్యంత రద్దీగా ఉండే ఈ మార్గంలో ఉన్న ఈ మట్టి దిబ్బ వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రిళ్లు ఈ మట్టి కుప్ప కనబడక ద్విచక్ర వాహనదారులు దానిపై ఎక్కించి కిందపడిపోతున్నారు. గుంత తవ్వి నెలలు గడుస్తున్నా పూడ్చకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ మట్టిని తొలగించాలని పలువురు కోరుతున్నారు.

కడప రిమ్స్ ప్రిన్సిపాల్‌కు అభినందన



డాక్టర్ సురేఖను అభినందిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసనాయక్, వైద్య బృందం

కడప అర్బన్ : కడప ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌గా అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (ఏడీఎంఈ)గా డాక్టర్ ఏ. సురేఖ పదోన్నతి పొందడంతో పాటుగా, రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా కొనసాగేందుకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఈ మేరకు డాక్టర్ సురేఖను కడప రిమ్స్‌లోని ప్రిన్సిపాల్ ఛాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, ఆర్‌ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసనాయక్, ఫోరెన్సిక్ విభాగం డాక్టర్ సుధాకర్, ఇతర వైద్యులు, సిబ్బంది అభినందించారు. అలాగే రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఏ. సురేఖ అడిషనల్ డీఎంఈ హోదాలో గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేఖ మాట్లాడుతూ రిమ్స్ సర్వతోముఖాభివృద్ధికి తమ వంతుగా కృషి చేస్తామన్నారు.

స్టాక్ బోర్డు, ధరల పట్టిక ఏర్పాటు చేయాలి



ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి

కమలాపురం : మండలంలోని అన్ని ఎరువుల, పురుగు మందుల దుకాణాలలో స్టాక్ బోర్డు, ధరల పట్టికను తప్పని సరిగా ఏర్పాటు చేయాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. గురువారం కమలాపురం పట్టణంతో పాటు మండలంలోని అన్ని ఎరువుల, పురుగుల మందుల దుకాణాలను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అలాగే ఎరువులు ఎంఆర్‌పీ ధర కంటే అధికంగా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వ్యవసాయ శాఖ అనుమతి పొందిన ఎరువులు, పురుగు మందులను మాత్రమే విక్రయించాలన్నారు. లేని పక్షంలో షాపులు సీజ్ చేస్తామన్నారు. ఏఓ సరస్వతి, ఏఈఓ దస్తగిరి ఆయన వెంట ఉన్నారు.

వల్లూరు : మండలంలోని ఎరువుల దుకాణాలను కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు ఏవీ నరసింహారెడ్డి గురువారం తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఎరువుల నిల్వలను, స్టాక్ రిజిస్టర్‌లోని నిల్వలను పరిశీలించారు. ఈ పాస్ మిషన్‌లో నిల్వలకు, స్టాక్ రిజిస్టర్‌లోని నిల్వలకు వ్యత్యాసాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు అమ్మరాదని, వ్యవసాయ శాఖ ద్వారా అనుమతి పొందిన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను మాత్రమే విక్రయించాలన్నారు. ప్రతి దుకాణదారుడు షాపులో స్టాక్ బోర్డు, ఎరువుల ధరల వివరాలను ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి సాయిజ్యోతి పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరాబ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఫోటో, వీడియోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేర్స్, సర్వీసింగ్‌లో 30 రోజులపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఎన్.నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే సీసీ టీవీ కెమెరా ఇన్‌స్టాలేషన్ సర్వీసింగ్‌లో కూడా 13 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. 18–45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ యువత శిక్షణకు అర్హులన్నారు. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల నిరుద్యోగ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అక్టోబరు 3వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని, ఇతర వివరాలకు 94409 05478, 99856 06866 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు శిక్షణ

బి.కోడూరు : మండలంలోని మేకవారిపల్లె రైతుభరోసా కేంద్రంలో గురువారం ఊటుకూరు కృషివిజ్ఞాన కేంద్రం, జిల్లా నీటి యాజమాన్య సంస్థ సౌజన్యంతో ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ వి.శిల్పకళ మాట్లాడుతూ రైతులు వ్యవసాయానికి సంబంధించిన నూతన వంగడాలను, సాంకేతికలను తెలుసుకుని ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా కొత్త రకాలను సాగు చేయాలని సూచించారు. అనంతరం పశువైద్యాధికారి లక్ష్మీనరసయ్య పశువుల ఆరోగ్యాన్ని ఎలా కాపాడాలో, వ్యాక్సిన్లు ఎప్పుడు వేయాలో తెలిపారు. ఉద్యాన విభాగ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.మానస మామిడి, నిమ్మ, చీనీ తోటల్లో యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ విధానాలను వరించారు.

చెక్కు అందజేత

గోపవరం : మండలంలోని బేతాయపల్లె గ్రామానికి చెందిన మచ్చా సుబ్బమ్మకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా గురువారం రూ.2 లక్షలు చెక్కును వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోపవరం మల్లికార్జున రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ ఏడాది జూన్‌లో గాలి, వాన బీభత్సానికి శ్రీనివాసపురం గ్రామం వద్ద రేకుల షెడ్డు కిందపడి మచ్చా చిన్న సుబ్బయ్య మృతిచెందాడు. ఈ మేరకు బాధిత కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం మంజూరైంది. తమకు ఆర్థిక సాయం అందించేందుకు కృషి చేసిన ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మ్యాన్‌హోల్‌కు మూత ఏర్పాటు



మ్యాన్‌హోల్‌పై ఏర్పాటు చేసిన మూత

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని కసాయివీధిలో ప్రాథమిక పాఠశాలకు ఎదురుగా డ్రైనేజీ కాలువపై ప్రమాదకర మ్యాన్‌హోల్‌కు అధికారులు మూతను సిద్ధం చేశారు. ఈ నెల 14వ తేదీన పొంచి ఉన్న ప్రమాదం అనే వార్త సాక్షిలో ప్రచురితమైంది. దీనికి స్పందించిన కార్పొరేషన్ అధికారులు డ్రైనేజీ కాలువపై ఏర్పాటు చేసిన మ్యాన్‌హోల్‌కు మూతను పెట్టి సిమెంట్‌తో కప్పేశారు. దీంతో స్థానికులతోపాటు పాఠశాల విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ సాక్షికి కృతజ్ఞతలు తెలియచేశారు.

నవయుగ వైతాళికుడు గురజాడ

కడప కల్చరల్ : నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు 162వ జయంతిని గురువారం బ్రౌన్ గ్రంథాలయ ఆవరణలో నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి , డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ గురజాడ అప్పారావు రాసిన కన్యాశుల్కం నాటకం ప్రపంచ ప్రఖ్యాతిగాంచిందని.. ఆ నాటకాన్ని 1890 ప్రాంతాల్లో పూర్తి వాడుక భాషలో రచించారన్నారు. రచయిత కొత్తపల్లి రామాంజనేయులు మాట్లాడుతూ గురజాడ రచనల గురించి వివరించారు. కార్యక్రమంలో సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్ : కడప గాంధీనగర్ హైస్కూల్లో గురువారం జేవీవీ ఆధ్వర్యంలో గురజాడ జయంతిని ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం సత్యసుజాతమ్మ మాట్లాడుతూ గురజాడ రచనలు స్ఫూర్తిదాయకమన్నారు.

మాచుపల్లి బస్టాండ్‌ను పునర్నిర్మించాలి

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని 26వ డివిజన్ పరిధిలో ఉన్న మాచుపల్లి బస్టాండును, మరుగుదొడ్లను పునర్నిర్మించాలని వైఎస్సార్‌సీపీ సిద్దవటం మండల కన్వీనర్ నీలకంఠారెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాసులరెడ్డి, వివిధ గ్రామాల ప్రజలు కోరారు. గురువారం వారు మేయర్ సురేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్‌కు వినతి పత్రాలు సమర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దవటం మండలంలోని 40 గ్రామాల ప్రజల సౌకర్యార్థం మాచుపల్లి బస్టాండును, మరుగుదొడ్లను పునర్నిర్మించాలన్నారు. బస్టాండులో మరుగుదొడ్లు లేక ప్రజలు ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిద్దవటం చుట్టు పక్కల గ్రామాల నుంచి రోజుకు 2వేల మందికిపైగా జనం కడపకు వస్తుంటారని, వీరిలో విద్యార్థులు, రైతులు ఎక్కువగా ఉన్నారన్నారు. బస్‌షెల్టర్, మరుగుదొడ్లు నిర్మిస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన పెద్దలు పాల్గొన్నారు.

మొబైల్ ఆధార్ కేంద్రం తనిఖీ



మొబైల్ ఆధార్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీవో జుబేద

వల్లూరు : మండల పరిధిలోని తోల్లగంగనపల్లె గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన మొబైల్ ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీవో జుబేద గురువారం తనిఖీ చేశారు. సచివాలయ పరిధిలో ఆధార్ అప్డేట్ చేయించుకున్న వారి సంఖ్య గురించి ఆరా తీశారు. ఆమె ఆధార్ కేంద్రంలో వున్న ప్రజలతో మాట్లాడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధార్ అప్డేట్ చేయించుకోవాలనే ధ్యేయంతో ప్రభుత్వం మొబైల్ ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. శుక్రవారం మండలంలోని తప్పెట్ల గ్రామ సచివాలయంలో, శనివారం వల్లూరు గ్రామ సచివాలయంలో మొబైల్ ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

ఆయిల్ ఫాం సాగుపై రైతులకు అవగాహన



రైతులకు ఆయిల్ ఫాంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు : మండలంలోని కల్లూరు, కామనూరు గ్రామాల్లో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో గురువారం రైతులకు ఆయిల్ ఫాం సాగుపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యానశాఖ అధికారి జయభరత్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ప్రొద్దుటూరు, మైదుకూరు, బ్రహ్మంగారిమఠం, కాశినాయన, పులివెందుల మండలాలను ఆయిల్ ఫాం సాగు చేసేందుకు ఎంపిక చేశారని తెలిపారు. సువేన్ ఆగ్రో ఇండస్ట్రీస్ అనే కంపెనీకి జిల్లాలో ఆయిల్ ఫాం సాగు చేయడం కోసం అనుమతి మంజూరు చేశారన్నారు. నీరు ఇంకిపోయే స్వభావం ఉన్న నేలలు, నీటి లభ్యత కలిగిన ప్రదేశాలు ఆయిల్ ఫాం సాగుకు అనుకూలమన్నారు. ఒక ఎకరాలో ఆయిల్ ఫాం సాగుకు 50–60 మొక్కలు అవసరమని, ఒక మొక్క రూ.193 అవుతుందని, వాటిని ఉచితంగా అందిస్తామన్నారు. ఎకరాకు అంతర పంటకు రూ.2,100, ఎరువులకు రూ.2,100 ఇస్తారని తెలిపారు. రైతులు ఎన్ని ఎకరాలు సాగు చేయడానికి ముందుకు వస్తే అన్ని ఎకరాలకు రాయితీ ఇస్తామన్నారు.

ఆడుదాం ఆంధ్రను విజయవంతం చేయాలి

గోపవరం : అక్టోబర్ 2 నుంచి నిర్వహించే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ తెలిపారు. గురువారం మండల అభివృద్ధి కార్యాలయంలో అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆడుదాం ఆంధ్రకు సంబంధించి ఆయా సచివాలయాల్లో 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఇప్పటికే పేర్లు నమోదు చేసుకున్నారని, వారి వివరాలను సేకరించి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అలాగే బడి ఈడు పిల్లలకు సంబంధించి వంద శాతం సర్వే పూర్తి చేయాలన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వేను వలంటీర్లు, ఏఎన్‌ఎంలు పక్కాగా నిర్వహించాలన్నారు. ఈ నెల 30వ తేదీన సచివాలయం పరిధిలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి అవసరమైన వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఈఓపీఆర్డీ హసీనా పాల్గొన్నారు.

లాభాల బాటలో చీనీ రైతులు

- సూట్ లేకుండా టన్ను రూ.23 వేలు పలుకుతున్న చీనీ ధరలు
- అనంతపురం మార్కెట్ కంటే పులివెందుల మార్కెట్ చీనీ ధరలు ఎక్కువ
- మార్కెట్‌యార్డుకు చీనీకాయలు తరలిస్తున్న రైతన్నలు



పులివెందుల మార్కెట్‌యార్డులో వేలంపాటలో పాల్గొన్న రైతులు

పులివెందుల రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కళ్లలో ఆనందం చూడాలన్న లక్ష్యంతో ముద్దనూరు రోడ్డులోని వ్యవసాయ మార్కెట్‌లో సుమారు లక్షల రూపాయల వ్యయంతో షెడ్లు ఏర్పాటు చేశారు. అలాగే చీనీకాయలకు సూట్ లేకుండా చేయాలనే దృఢసంకల్పంతో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సలహాలతో పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి సూచనల మేరకు రైతులకు ఎంపీడీఓ కార్యాలయం, రైతు భరోసా కేంద్రాలలో అవగాహన కల్పించారు. ఉద్యానవనశాఖ, మార్కెటింగ్‌శాఖ అధికారులు రైతులు, చీనీ వ్యాపారులతో కలిసి చీనీకాయలకు సూట్ లేకుండా కొనుగోలు చేసేందుకు మార్కెట్‌యార్డులో అనుకూలంగా గదులను నిర్మించారు. నియోజకవర్గంలోని రైతన్నలు అధిక సంఖ్యలో చీనీకాయలను తీసుకువచ్చి మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్నారు. రైతులు తాము పండించిన చీనీకాయలను విక్రయించేందుకు ప్రతీరోజు సుమారు 30 నుంచి 40 టన్నుల వరకు మార్కెట్‌కు తరలిస్తున్నారు. మార్కెట్‌లో టన్ను చీనీధరలు రూ.23 వేలు బాగానే ఉండటంతో రైతన్నలందరు మార్కెట్‌లోనే తాము పండించిన చీనీకాయలను తీసుకువచ్చి విక్రయాలు చేస్తున్నారు. బయట అనంతపురం జిల్లా మార్కెట్‌కంటే పులివెందుల మార్కెట్‌లో చీనీ టన్ను ధర నాణ్యమైన కాయలైతే రూ.23వేలు పైచిలుకే ఉంటోంది. కాయల నాణ్యతను బట్టి రైతన్నలు చీనీ విక్రయాలు చేస్తున్నారు. అలాగే రైతులు కూడా తాము పండించిన పంటలను గ్రేడింగ్ చేసుకుని మార్కెట్‌కు తరలిస్తున్నారు. అనంతపురం మార్కెట్‌లో అయితే 10 టన్నులకు రెండున్నర టన్ను సూట్ తీసుకుంటున్నారని, పులివెందుల మార్కెట్‌లో అయితే ఎటువంటి సూట్ తీసుకోవడం లేదని రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే రవాణా చార్జీలు కూడా తగ్గుతుండడం వల్ల పులివెందుల మార్కెట్‌కే చీనీకాయలను తరలించి విక్రయాలు చేస్తున్నారు.

పులివెందుల మార్కెట్‌లో సూట్ ఉండదు



రైతులు పండించిన పంటలను ఇతర మార్కెట్‌లకు తరలిస్తే 10 టన్నులకు రెండున్నర టన్ను సూట్ వేస్తారు. కానీ పులివెందుల మార్కెట్‌కు తరలిస్తే ఎటువంటి సూట్ ఉండదు. అనంతపురం జిల్లా మార్కెట్‌లో కంటే పులివెందుల మార్కెట్‌లో చీనీ ధరలు బాగానే ఉన్నాయి. దీంతో రైతులకు లాభాలు కూడా వస్తున్నాయి.

– భాస్కర్‌రెడ్డి, రైతు

రవాణా చార్జీలు తగ్గుతాయి



రైతులు పండించిన పంటలను అనంతపురం, తిరుపతి, బెంగుళూరు, హైదరాబాదు మార్కెట్‌లకు తరలించాలంటే రవాణా చార్జీలు ఎక్కువగా చెల్లించాల్సి ఉంటుంది. పులివెందుల మార్కెట్‌లో చీనీకాయలను అధికారులే కొనుగోలు చేయడం వల్ల రవాణా చార్జీలు చాలా వరకు తగ్గుతాయి. చీనీకాయల కొనుగోలు కేంద్రాలను పులివెందులలో ఏర్పాటు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాము.

– నారాయణరెడ్డి, రైతు

రైతులకు గిట్టుబాటు ధరను ప్రభుత్వం కల్పిస్తుంది



రైతులు తాము పండించిన పంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిట్టుబాటు ధర కల్పించే విధంగా అన్ని సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు. గతంలో రైతులు పండించిన చీనీకాయలను ఇతర ప్రాంతాలకు తరలించేవారు. పులివెందులలో వ్యవసాయ మార్కెట్‌లో రైతులకు అనుగుణంగా చీనీకాయలు నిల్వ ఉంచుకుని విక్రయాలు జరిపేందుకు జంబో షెడ్డుతో పాటు గదులను ఏర్పాటు చేశారు. రైతులు కూడా పులివెందుల చీనీ మార్కెట్‌కు అధిక సంఖ్యలో తరలివచ్చి చీనీకాయలను విక్రయిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు.

– చిన్నప్ప, మార్కెట్‌యార్డు ఛైర్మన్

మతి స్థిమితం లేని వ్యక్తికి సేవలు



మతి స్థిమితంలేని వ్యక్తికి క్షురకర్మ చేస్తున్న విజయ్‌బాబు

కమలాపురం : పట్టణంలో మతి స్థిమితంలేని వ్యక్తికి అభి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎస్.విజయ్‌బాబు సేవలు చేశారు. మాసిన బట్టలు, పెరిగిన జుట్టుతో తిరుగుతున్న మతి స్థిమితం లేని వ్యక్తిని గురువారం విజయ్‌బాబు స్వయానా కటింగ్ చేసి స్నానం చేసి, బట్టలు మార్చారు. ఊరు, పేరు చెప్పలేని స్థితిలో ఉన్న ఆ వ్యక్తికి సేవలు చేసినందుకు పట్టణ ప్రజలు విజయ్ బాబును అభినందించారు.

మహిళల రిజర్వేషన్‌లో బీసీల కోటా ప్రకటించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 33 శాతం మహిళల రిజర్వేషన్‌లో బీసీ కోటా ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ మాదాసు మురళి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మైదుకూరు రోడ్డులోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నల్ల రిబ్బన్లతో సంఘం నాయకులు నిరసన తెలిపారు. బీసీలకు మూడో వంతు కోటా లేని మహిళా బిల్లు అసంపూర్ణమే అని తెలిపారు.